
సాక్షి
మహబూబాబాద్
సోమవారం ¦ 21 ¦ జూలై ¦ 2025



ఐటీఐ చదువు..ఉపాధికి నెలవు

ప్రస్తుతం ఐటీఐతో ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. - 8లో▸



రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం

రాజ్యాధికారంతోనే బీసీలకు సామాజిక న్యాయం సాధ్యమని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.7⁰ /23.5⁰

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొండ చిలువ హతం



మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం రెవెన్యూ పరిధిలోని అజ్మీరాతండా గ్రామ పంచాయతీ జీన్యతండా శివారులో ఆత్మరక్షణలో భాగంగా ఓ కొండ చిలువను ఆదివారం స్థానికులు చంపేశారు. తండా శివారులో కొందరు జీవాల పెంపకందారులు మేకలు మేపుతున్న క్రమంలో చెట్ల పొదల్లో నుంచి వచ్చిన పెద్ద కొండచిలువ ఓ మేకను పట్టే ప్రయత్నం చేసింది. దీంతో ఒక్కసారిగా మేకలన్నీ చిందర వందర పరుగెత్తాయి. దీంతో కొండ చిలువను గమనించిన జీవాల పెంపకందారులు దాన్ని చంపేశారు. ఈ కొండ చిలువ సుమారు 10 ఫీట్ల పొడవు ఉన్నట్లు మేకల కాపరులు తెలిపారు.

శిథిలావస్థలో కంకరబోడ్ సంపు




మహబూబాబాద్: కంకరబోడ్ ప్రాంతంలో ఉన్న సంపుతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనని భయపడుతున్నారు. సంపునకు సంబంధించిన స్లాబ్ ఇప్పటికే చాలాభాగం ఊడి పడిపోయింది. ఎవరైనా తెలియక ఆసంపు స్లాబ్‌పైకి వెళ్తే అందులో పడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ ఆ సంపును ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ప్రాంతంలో కొన్ని దశాబ్దాల క్రితం ఈ సంపును నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. ఈ సంపు నుంచి పలు కాలనీలకు నీటిని సరఫరా చేసే వారు.. కానీ, మిషన్‌భగీరథ పథకం ప్రారంభించి నీటిని సరఫరా చేస్తున్నప్పటి నుంచి ఈ సంపును ఉపయోగించడంలేదని స్థానికులు తెలిపారు. ఈ సంపు పక్కనే పంపు హౌజ్ రూం కూడా ఉంది. దానిని తాగు నీరు సరఫరా చేసే సిబ్బంది స్టోర్ రూంగా ఉపయోగిస్తున్నారు. సంపు చుట్టు పరిసరాలు కూడా అపరిశుభ్రంగా మారి పందులు సంచరిస్తున్నాయి. ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు, పిల్లలు తెలియక సంపు స్లాబ్ ఎక్కితే దానిలో పడే ప్రమాదం ఉందని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల పాదయాత్రను విమర్శించడం మూర్ఖత్వం



పెద్దవంగర: రైతుల కోసం చేపట్టిన పాదయాత్రను కూడా వక్రీకరిస్తున్నారని, కాలువలు ఎండిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి సంక్షోభం తీవ్రమవుతోందని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజుల్లో నీరు వదులుతారో ప్రభుత్వం స్పష్టం చేయాలని, లేదంటే సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు మహాధర్నా నిర్వహించకతప్పదన్నారు. రెండేళ్లుగా రైతులు నీటి కొరతతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో దేవాదుల, ఎస్సారెస్పీ కాలువల ద్వారా ఏడాదంతా నీళ్లు అందేలా చూశామని గుర్తు చేశారు. అనంతరం చిట్యాల, బొమ్మకల్లు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బొగత వద్ద పర్యాటకుల సందడి




వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు కావడంతో పర్యాటకులు భారీసంఖ్యలో తరలివచ్చి ప్రకృతి అందాలు చూసి ఫిదా అయ్యారు. జలదారలను వీక్షించడంతో పాటు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. కొలనులో స్నానాలు చేయడంతో పాటు ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

సుఖ ప్రసవం

ప్రభుత్వ ఆస్పత్రిలో పెరిగిన ప్రసవాలు

- బాలింతలు, గర్భిణులతో మాతా శిశు సెంటర్ల కిట కిట
- ప్రైవేట్‌కు వెళ్తే ఆపరేషన్ తప్పని సరి
- పెరిగిన డాక్టర్లు, స్టాఫ్ నర్సులతో మెరుగైన సేవలు



సాక్షి, మహబూబాబాద్: 'నేను రాను బిడ్డో ప్రభుత్వ దవాఖానకు..' అంటూ పాటలు పాడుకునే పరిస్థితి నుంచి నేను ప్రభుత్వ ఆస్పత్రికే వెళ్తా.. అనే రోజులు వచ్చాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో రోజు రోజుకూ ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మెరుగుపడుతుంది. మారుమూల మానుకోట.. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరిగింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు.. దీనికి అనుగుణంగా ఆస్పత్రి స్థాయి కూడా పెరిగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ప్రసవం సుఖంగా అవుతుంది.. తల్లీబిడ్డలు క్షేమంగా ఇల్లు చేరుతారనే నమ్మకం పెరిగింది. దీంతో గర్భిణులు ఎక్కువగా ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి వైపు...

ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఆలోచనతో వైద్యారోగ్య, వైద్య విధాన పరిషత్, వైద్య విద్య శాఖలను బలోపేతం చేశారు. దీంతో బాలింతలు, శిశు మరణాల సంఖ్యను తగ్గించేందుకు క్షేత్ర స్థాయి నుంచి అవగాహన పెంచారు. ఇందుకోసం నెల తప్పిన నాటి నుంచి ఆశ, ఏఎన్ఎం పర్యవేక్షణ, ప్రతీ నెలా ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు, అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు, పౌష్టికాహారం అందచేయడంతోపాటు ప్రసవం ఆస్పత్రిలోనే జరిగేలా అవగాహన పెంచారు. దీనికి తోడు పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు నిర్వహించి ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుక రావడం, ఇందుకోసం ఆలనా, ఇతర ప్రభుత్వ వాహనాలు అందుబాటులో ఉంచడంతోపాటు ఆశా వర్కర్లే గర్భిణి ఆస్పత్రికి తీసుకొచ్చి పరీక్షలు చేయిస్తున్నారు. దీంతో రోజు రోజుకు ప్రభుత్వ ఆస్పత్రికివచ్చే గర్భిణుల సంఖ్య పెరుగుతుంది.



బాలింతలతో నిండి ఉన్న మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

రికార్డు స్థాయిలో ప్రసవాలు

మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలు పెరుగుతున్నాయి. నెలకు సగటున 500 కు మించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. 2023–24 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,077 ప్రసవాలు జరిగాయి. ఇందులో 2,663 ప్రసవాలు నార్మల్, 7,147 సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2,259 సాధారణ, 3,480 సిజేరియన్ ప్రసవాలు జరగడం గమనార్హం. అదే ప్రైవేట్ ఆస్పత్రుల్లో 4,066 ప్రసవాలు జరుగగా కేవలం 404 సాధారణ ప్రసవాలు.. 3,667 సిజేరియన్లు జరిగాయి. 2024–25 సంవత్సరంలో 9,207 ప్రసవాలు జరగ్గా సగానికి ఎక్కువ 4,945 ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగాయి. ఇందులో అత్యధికంగా మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగాయి. ఆస్పత్రి స్థాయిని 330 పడకలకు పెంచడంతోపాటు అన్ని విభాగాల డాక్టర్లు, స్టాఫ్ నర్సుల సంఖ్య పెంచి సేవలు అందిస్తున్నారు.

వసతులు బాగున్నాయి



మహబూబాబాద్ ప్రభుత్వం ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చాను. నొప్పులు రాగానే ఆస్పత్రికి రమ్మని చెప్పారు. వచ్చిన తర్వాత నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించారు. కానీ తప్పని పరిస్థితిలో ఆపరేషన్ చేశారు. తల్లీ, పిల్లలం ఆరోగ్యంగా ఉన్నం. ఆస్పత్రిలో వసతులు బాగున్నాయి. డాక్టర్లు, సిస్టర్లు బాగానే చూసుకుంటున్నారు.

- రూత, బాలింత తొర్రూరు

ప్రైవేట్‌కు పోతే డబ్బులు వృథా..



మేం మొదటి నుంచి గవర్నమెంట్ ఆస్పత్రిలోనే చూపించుకుంటున్నా. ప్రసూతి కూడా ఇక్కడే చేశారు. ఇంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రికి పోతే సరిగ్గా చూడటం లేదని ప్రైవేట్ ఆస్పత్రికి పోయి డబ్బులు ఖర్చు చేసేది. ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా డెలవరీ చేసి ప్రభుత్వ వాహనంలోనే ఇంటికి పంపిస్తున్నారు.

- ఎడపెల్లి కావేరీ, బాలింత, మహబూబాబాద్

ప్రజలు వినియోగించుకోవాలి



అన్ని వసతులు, ఎంఎస్, గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులతోపాటు, మత్తు డాక్టర్లు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నారు. ఇన్ని వసతులు ఉండి, ఉచిత వైద్యం అందించే ఆస్పత్రిని విడిచి ప్రైవేట్ ఆస్పత్రి వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దు. అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని వినియోగించుకోవాలి.

- శ్రీనివాస్, సూపరింటెండెంట్, మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- విద్యుత్‌శాఖ డైరెక్టర్ మధుసూదన్



మధుసూదన్‌ను సన్మానిస్తున్న మహబూబాబాద్ సర్కిల్ అధికారులు

నెహ్రూసెంటర్: జిల్లాలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా విద్యుత్‌శాఖ ఇంజనీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్‌తో సమీక్ష సమావేశం ఆదివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క ప్రమాదం కూడా జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తగా వేస్తున్న 33 కేవీ ఇంటర్ లింకింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిలింగ్‌ను తగ్గించి నష్టం రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఒకే బ్రేకర్‌పై రెండు ఫీడర్స్ ఉంటే రెండు బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఆటో స్టార్టర్లను తొలగించి తప్పనిసరిగా విద్యుత్ మోటారు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. లో ఓల్టేజీ సమస్య రాకుండా రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. అనంతరం డైరెక్టర్ మధుసూదన్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్, ఎస్ఈ విజేందర్‌రెడ్డి, డీఈలు పి.విజయ్, హీరాలాల్, రవి, సునీత, ఎస్ఏఓ శంకర్, జిల్లా ఏడీఈలు, ఏఈ, అకౌంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

23 నుంచి కేయూ ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిం ఇక్బాల్ తెలిపారు. ఈనెల 23, 25, 28, 30, ఆగస్టు ఒకటి, నాలుగో తేదీల్లో పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

ఏడాదిలోపే బదిలీలు!

- పదోన్నతులు లేక ఇన్‌చార్జ్‌లతోనే పాలన
- నేడో రేపో సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం



కాజీపేట అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు సాధారణంగా రెండు నుంచి మూడేళ్ల తర్వాత బదిలీ అవుతారు. కానీ, ఇందుకు భిన్నంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలోని అధికారులను ఏడాదిలోపే బదిలీలు చేయడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేసింది. ఇందులో భాగంగా 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు స్లాట్ బుకింగ్, పారదర్శక సేవలకు ఈ–సైన్‌తో రిజిస్ట్రేషన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదేవిధంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై పర్యవేక్షణ కొనసాగించే జిల్లా రిజిస్ట్రార్లకు ఏడాదిలోపే స్థానచలనం కల్పించింది.

పదోన్నతులకు బ్రేక్..

జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్లుగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతులు కల్పించడంలో జాప్యం అవుతోంది. సుమారు నాలుగేళ్లుగా జిల్లా రిజిస్ట్రార్ స్థానంలో అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లతోనే పాలన కొనసాగుతోంది. కాగా, ఒక్కో జిల్లా రిజిస్ట్రార్ రెండు మూడు కార్యాలయాలకు పనిచేయాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో బదిలీ అయిన ఫణీందర్ హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఆఫీస్ డ్యూటీలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్‌గా, కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. సీనియార్టీ ప్రకారం తమకు పదోన్నతి కల్పించాలని గతంలో విధులు నిర్వర్తించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్లు, వివిధ జిల్లాలకు చెందిన గ్రూప్–1 అధికారులు కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో పదోన్నతులకు బ్రేక్ పడింది.

త్వరలో సబ్ రిజిస్ట్రార్ల బదిలీ!

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గతేడాది ఆగస్టులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అటెండర్ స్థాయి నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీలు అయ్యారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాధ్యతలను స్వీకరించి లాంగ్ లీవ్‌లోకి వెళ్లిపోయిన సబ్ రిజిస్ట్రార్లు, సహాయ రిజిస్ట్రార్ చిట్స్‌లు అనగా స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ ఆర్వో చిట్స్ కార్యాలయంలోని అధికారులతోపాటు వరంగల్ ఆర్వోకు చెందిన సబ్ రిజిస్ట్రార్లు సైతం స్థానచలనంలో భాగంగా నేడో రేపో బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, మేరా నంబర్ ఆయేగా అంటూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చర్చించుకోవడం గమనార్హం.

డేంజర్ జోన్లకు వెళ్లేందుకు జంకుతున్న సబ్ రిజిస్ట్రార్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్లు ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు డేంజర్ జోన్లుగా మారిపోయాయి. ట్రాన్స్‌ఫర్ ఓకే కాని డేంజర్ జోన్లకు వద్దు అంటూ తలలు పట్టుకుంటున్నారు సబ్ రిజిస్ట్రార్లు.

వడ్డీ బకాయిలు విడుదల

- ఎస్‌హెచ్‌జీలకు రెండు నెలల వడ్డీని మంజూరు చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 50,372 సంఘాలు
- రూ.20.27 కోట్లు పొదుపు సంఘాల ఖాతాల్లో జమ



ఎలుకుర్తిలో సెర్ప్ అదనపు సీఈఓ కాత్యాయనీదేవితో పొదుపు సంఘాల మహిళలు, అధికారులు (ఫైల్)

గీసుకొండ: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న సెర్ప్ పొదుపు సంఘాల మహిళలకు రెండు నెలల వడ్డీ బకాయిలు మంజూరయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళల అభ్యున్నతికి పలు కార్యక్రమాలను చేపడుతుండగా తాజాగా వడ్డీ బకాయిల చెల్లింపు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ మేరకు వడ్డీ బకాయిలను ప్రభుత్వం ఆయా సంఘాల ఖాతాల్లో జమచేసింది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో సకాలంలో వడ్డీ బకాయిలు విడుదల కాకపోవడంతో పొదుపు సంఘాల మహిళలు ఇబ్బందులు పడ్డారు. 2019 నుంచి 2022 వరకు మూడేళ్ల వడ్డీ నిధులు మంజూరు చేయలేదు.

విడతల వారీగా చెల్లింపులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించింది. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 2023–24 సంవత్సరానికి సంబంధించి నాలుగు నెలల బకాయిలను కొన్ని నెలల క్రితం విడుదల చేసింది. ఆ తర్వాత 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు పది నెలల వడ్డీ బకాయిలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాల్లోని 48,717 సంఘాలకు రూ.92.74 కోట్ల బకాయిలను విడుదల చేసింది. అలాగే, ఇటీవల ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలకు సంబంధించి ఎస్‌హెచ్‌జీలు 50,372 ఉండగా వారికి వడ్డీ కింద రూ.20.27 కోట్లను మంజూరు చేయడంతో పొదుపు సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలకు విడుదలైన వడ్డీ బకాయిలు

జిల్లా పేరు	లబ్ధిపొందిన సంఘాలు	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)
వరంగల్	9,669	4.32
హనుమకొండ	8,600	3.86
జనగామ	9,216	3.41
మహబూబాబాద్	11,552	4.51
ములుగు	5,308	1.92
జయశంకర్ భూపాలపల్లి	6,027	2.25

స్వయం ఉపాధికి ఊతం..

మహిళా సంఘాల్లోని సభ్యులు బ్యాంకు లింకేజీ కింద తీసుకున్న వడ్డీ లేని రుణాల(వీఎల్ఆర్)తో ఆర్థికంగా ఎదగటంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పలువురు చిన్న తరహా పరిశ్రమలు, యూనిట్లను నెలకొల్పుతున్నారు. క్యాంటీన్ల ఏర్పాటు, పెరటికోళ్ల పెంపకం, గేదెల పోషణ, కిరాణం, క్లాత్ స్టోర్లు, టైలరింగ్, సానిటరీ న్యాప్కిన్‌ల తయారీ తదితరాలను ఎంచుకుని ఆదాయం పొందుతూ చిన్నపాటి పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్నారు. అలాటి వారికి వడ్డీ బకాయిలను సకాలంలో అందిస్తే మరింత ఉత్సాహంతో ముందుకు సాగే అవకాశం ఉంటుందనే ఆలోచనతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

పాత బకాయిల చెల్లింపు ఊసేలేదు..

ఇది ఇలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన వడ్డీ బకాయిలు అలాగే పేరుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తన హయాం నుంచి వడ్డీ బకాయిలు విడతల వారీగా చెల్లిస్తూ వస్తోంది. అయితే గత బీఆర్ఎస్ సర్కారు కాలంలో పేరుకుపోయిన భారీ మొత్తంలోని బకాయిల గురించి ఎవరూ ఊసెత్తడం లేదు. అటు అధికారులు, ప్రభుత్వం దీనిపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో అయోమయం నెలకొంది.

భక్తజనంతో పులకించిన హేమాచల క్షేత్రం

- తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు




ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి, దర్శనం చేసుకుంటున్న భక్తులు

మంగపేట : మండలంలోని మల్లూరు శ్రీహేమాచల క్షేత్రం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల్లోని సుదూర ప్రాంతాల నుంచి స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో హేమాచలక్షేత్రం పులకించింది. ఆది, సోమవారాలు రెండు రోజులు సెలవు కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ఏజెన్సీలోని లక్నవరం, బొగత తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. రామప్ప, మేడారం సమ్మక్క– సారలమ్మ వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు కార్లు, ప్రైవేట్ బస్సులు, ఆటోలు తదితర వాహనాల్లో భారీగా తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో సహజ సిద్ధంగా వెలిసిన చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు అర్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు, నాగఫణిశర్మ స్వామివారికి తిల తైలాభిషేకం పూజలు జరిపించి నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కైంకర్యాదులు నిర్వహించారు. మూడు గంటల పాటు వేచి ఉండి మానవ శరీరాన్ని పోలి ఉండే స్వయంభూ స్వామవారి అభిషేక పూజలో పాల్గొని ఆలయ చరిత్ర, స్వామివారి ప్రత్యేకతను తెలుసుకుని పులకించారు. అనంతరం సంతానం కోసం స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని స్వీకరించేందుకు వచ్చిన దంపతులతో పాటు స్వామివారి అభిషేక పూజలో పాల్గొన్నారు. భక్తుల గోత్రనామాలతో పూజారులు ప్రత్యేక అర్చనలు జరిపించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్‌టవర్ పైనుంచి దట్టమైన అటవీ ప్రాంతంలోని కనుచూపు మేర కనిపించే అందమైన ప్రకృతి అందాలను వీక్షించి సెల్ఫీలు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, రికార్డు అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌తో రోడ్డెక్కిన అన్నదాతలు



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నెల్లికుదురు: విద్యుత్ అంతరాయంతో నానా అవస్థలు పడుతున్నా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని పార్వతమ్మగూడెం రైతులు కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఆదివారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరినాట్లు వేసేందుకు పొలం సిద్ధం చేసుకునే క్రమంలో వారం రోజులుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించినా మళ్లీ కాలిపోవడంతో అవస్థలు పడుతుంటే విద్యుత్ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని, ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చే వరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని భైఠాయించారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు రోజుల్లో మరమ్మతులు చేపడుతామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చినప్పటికీ.. మరమ్మతులు వద్దని నూతన ట్రాన్స్ ఫార్మర్ కావాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సోమిరెడ్డి, వీరారెడ్డి, మల్లారెడ్డి, ఎల్లారెడ్డి, నాగయ్య, సతీష్, కొమురయ్య పాల్గొన్నారు.

‘ఫాదర్ కొలంబో’లో ప్రవేశాలు రద్దు


ఫాదర్ కొలంబో వైద్యకళాశాల

కాజీపేట రూరల్ : వరంగల్ హంటర్ రోడ్డు సమీపంలో గల ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలను రద్దు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం వైద్య కళాశాల వర్గాలు తెలిపాయి. 2023లో కొలంబో వైద్యకళాశాలకు ఎన్‌ఎంసీ అనుమతులు జారీ చేసింది. కొలంబో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు అధికార అనుమతుల కోసం కాలేజీ ట్రస్టీ మెంబర్ కొమ్మారెడ్డి జోసెఫ్ మెడికల్ కళాశాల తనిఖీలో అనుకూలంగా నివేదికలు ఇచ్చేందుకు రూ.46 లక్షలు లంచం ఇచ్చినట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ స్కాంలో తేలిన విషయం తెలిసిందే. ఈ విషయంలో సీబీఐ కేసు నమోదు చేసింది. కాలేజీ తనిఖీలో భాగంగా అధికారులకు లంచాలు ఇచ్చిన సీబీఐ కేసు ప్రభావంతో ఎన్‌ఎంసీ మెడికల్ కాలేజీలో ప్రవేశాలు రద్దు చేసినట్లు తెలిపాయి.దీంతో ఇటు ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ విద్యార్థులు, అటు వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

అడవుల రక్షణే బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

● పీసీసీఎఫ్ సీహెచ్ సువర్ణ


అధికారులకు సూచనలిస్తున్న పీసీసీఎఫ్ సీహెచ్ సువర్ణ

గూడూరు : అడవుల రక్షణతో పాటు వన్యప్రాణులు, పర్యాటక కేంద్రాల వద్ద బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పీసీసీఎఫ్ సీహెచ్ డాక్టర్ సువర్ణ అధికారులకు సూచించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని అడవిలో గల పర్యాటక ప్రాంతం భీమునిపాదం జలపాతాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జలపాత దృశ్యాలను వీక్షించారు. అనంతరం భీమునిపాదంలో పర్యాటకులకు అవసరమైన వసతుల కల్పించాలని, బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇక్కడ అటవీ ప్రాంతం పచ్చని మైదానంతో చూపరులను కనువిందు చేసేలా ఉందని, అటవీ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నా రు. కార్యక్రమంలో భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌ఓ బత్తుల విశాల్, ఎఫ్‌డీఓ చంద్రశేఖర్ రావు, ఎఫ్‌ఆర్వో బి.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం శివారులోని కొండాపూర్ వద్ద గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 17న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్–19 జూనియర్స్ బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, రాష్ట్రస్థాయి పోటీల కన్వీనర్లు కిశోర్, వన్నెల భూమన్న నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. 33 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొనగా 166 మంది క్వాలిఫై అయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో వరంగల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన శౌర్య కిరణ్, రిషిత పాండే.. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన అమన్ అనీశ్, రియా సుశీల్‌పై గెలుపొందారు. బాలుర సింగిల్స్‌లో సంగారెడ్డి జిల్లాకు చెందిన సాయి నచికేత్ బత్రాజ్.. వరంగల్ జిల్లాకు చెందిన అఖిల్‌రావు సూర్యనేనిపై గెలుపొందారు. విజేతలకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి మెడల్స్, కప్‌లు అందజేశారు.

ఐటీఐ చదువు.. ఉపాధికి నెలవు

● మారిన తల్లిదండ్రుల దృక్పథం
● ఏటేటా పెరుగుతున్న అడ్మిషన్లు
● ట్రేడ్ ఏదైనా మంచిదేనంటున్న అధ్యాపకులు


కాజీపేటలోని ఐటీఐ కళాశాల భవనం


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కాజీపేట : ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీలు, పీజీలు చేసినా అనేకమందికి ఉపాధి లభించని పరిస్థితి నెలకొంది. అయితే పదో తరగతి పూర్తయ్యాక ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధినిచ్చే కోర్సుల్లో ఐటీఐ ప్రధానమైంది. పారిశ్రామిక అవసరాలకు తగిన మానవ వనరులు ఐటీఐ కేంద్రాల నుంచే లభ్యమవుతుండటంతో ఈ కోర్సులు చేసేందుకు ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

ఐటీఐ లక్ష్యం..

కేంద్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఈ ఐటీఐలను ప్రారంభించింది. నిరుద్యోగాన్ని తగ్గించడం, మానవ వనరుల నైపుణ్యాలను పెంచి పరిశ్రమలకు అందించడం వీటి లక్ష్యం. ఈ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ)ని ఎంచుకోవడం ద్వారా పదో తరగతి తర్వాత ఒకటి, రెండేళ్ల కాల వ్యవధిలో సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించవచ్చు. ఉమ్మడి జిల్లాలో 5 ఐటీఐ (ప్రభుత్వ ఆధ్వర్యంలో), 40 ఐటీసీలు (ప్రైవేటు రంగంలో) ఉన్నాయి.

బాలికల్లో ఆదరణ ఎక్కువ..

పారిశ్రామిక శిక్షణ వైపు బాలికలు ఆదరణ చూపుతున్నారు. సీట్ల కేటాయింపులో 33శాతం రిజర్వేషన్ బాలికలకు కల్పిస్తుండటంతో పాటు ఉపాధి అవకాశాలు రోజురోజుకు పెరుగుతుండటంతో ఆసక్తి కనబరుస్తున్నారు. బాలికల్లో దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది.

ట్రేడ్‌లు ఇలా..

ఐటీఐల్లో ఇంజనీరింగ్ కోర్సులు (ట్రేడ్లు) వ్యవధి రెండేళ్లు..అలాగే నాన్–ఇంజనీరింగ్ ట్రేడ్లు ఏడాది, ఆరునెలల కాలపరిమితితో ఉన్నాయి. రెండేళ్ల వ్యవధి గల ట్రేడ్స్‌లో అభ్యర్థి చేరితే శిక్షణ ముగిశాక ఏడాదిపాటు అప్రెంటిషిప్ చేయాల్సి ఉంది. మొత్తం మూడేళ్లు కష్టపడితే తప్పకుండా ఉపాధి పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కోపా, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్, కార్పెంటర్, స్టెనోగ్రాఫర్, పీపీఓ తదితర కోర్సులకు ఏడాది కాలవ్యవధి ఉంటుంది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఐఎం కెమికల్, ఐఎం (ఎస్పీ), మెషినిస్టు, టర్నర్, పెయింటర్ తదితర కోర్సులు రెండేళ్ల కాల వ్యవధిలో ఉంటాయి.

సెమిస్టర్ విధానంతో పారదర్శకత..

ఐటీఐ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యార్థుల మాదిరిగా సెమిస్టర్ విధానంలో ఆరు నెలలకొకసారి ప్రధాన పరీక్షలు జరుగుతాయి. ఏడాది వ్యవధిగల ట్రేడ్ విద్యార్థులు రెండు సెమిస్టర్లు, రెండేళ్ల వ్యవధి గల విద్యార్థులు నాలుగు సెమిస్టర్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత కావాల్సి ఉంది. ఏ ఒక్క సెమిస్టర్ ఫెయిల్ అయినా ఐటీఐ పరీక్ష తప్పినట్టే. దీంతో పరీక్షల సమయంలో కాకుండా రోజు పుస్తకాలతో కుస్తీ తప్పనిసరి.

ఐటీఐలకు గ్రేడింగ్‌లు..

ఐటీఐల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ విద్యాసంవత్సరం నుంచి గ్రేడింగ్ (స్టార్‌ల) విధానాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి ఐటీఐలకు 5స్టార్లను కేటాయిస్తారు. చక్కటి మౌలిక వసతులున్న ఐటీఐలకు 5 స్టార్లు, కాస్తా తక్కువగా ఉంటే 4స్టార్లు ఇలా ఒక్కటి వరకు కేటాయిస్తారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన తర్వాత వారి సర్టిఫికెట్లపై స్టార్లను ముద్రించి ఇస్తారు. దీన్ని బట్టీ ఆయా విద్యార్థులు చక్కటి పరిస్థితుల మధ్య విద్యను అభ్యసించినట్లుగా కంపెనీలు గుర్తిస్తాయి.

ఎంఓయూలు కుదుర్చుకోవాలి..

ఐటీఐ స్థాయిలోనే కంపెనీలు, సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకునే అవకాశం యాజమాన్యానికి ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉత్పత్తి లక్ష్యంగా ఐటీఐలు కంపెనీలను మరిపించేలా విద్యార్థులకు చక్కటి నైపుణ్యాన్ని కల్పించాలి.

ఐటీఐ తర్వాత పాలిటెక్నిక్ కోర్సులోకి..

రెండేళ్ల ఐటీఐలో చదివిన అభ్యర్థులు ఉన్నత చదువుల కోసం, నేరుగా పాలిటెక్నిక్ రెండో ఏడాదిలో ప్రవేశానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఈ ఐటీఐ సీట్లకు డిమాండ్ పెరిగింది. ఐటీఐ కోర్సు అనంతరం నెల రోజుల పాటు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సును నిర్వహించి వీరికి పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ప్రతిభను కనబరిస్తే ఆయా విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సంబంధిత బ్రాంచిలో నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. దీంతో ఐటీఐ చదివిన విద్యార్థులు అవసరమైతే ఉపాధి అవకాశాలు వెతుక్కోవచ్చు. లేదా డిప్లొమా, బీటెక్, డిగ్రీ తదితర ఉన్నత విద్య చదవడానికి వీలుంది. ఐటీఐ ఉత్తీర్ణతను సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియట్ సర్టిఫికెట్‌కు సమానం. దీంతో డిగ్రీ, డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చు.

దరఖాస్తు ఇలా..

ఐటీఐల్లో ప్రవేశాలకు 15 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులు. ఈ నెల 22వ (మంగళవారం) తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉంది. ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థికి కేంద్రప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండే నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్ (ఎన్‌సీవీటీ) సర్టిఫికెట్ అందిస్తోంది. పదో తరగతి పాసైన అభ్యర్థులు హనుమకొండ ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తు ఫారాన్ని పొంది ఏ ఐటీఐలో సీటు ఆశిస్తున్నారో అక్కడే సమర్పించాల్సి ఉంటుంది. ఈ నెలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ఉంటుంది. ఎలాంటి రుసుం లేకుండా ప్రభుత్వం ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది. ప్రైవేటు (ఐటీసీ)లో జాయిన్ అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉంది.

ఐటీఐ విద్యలో చాలా మార్పులు



ఐటీఐల్లో చేరిన విద్యార్థులకు చక్కటి పని నైపుణ్యంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా ప్రభుత్వం వసతులు కల్పిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఉన్నత చదువులకు అవకాశం, వృత్తినైపుణ్యతకు పెద్దపీట వేస్తోంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో కంపెనీలతో ఐటీఐల స్థాయిలోనే ఎంఓయూలు కుదుర్చుకునే వీలు ఏర్పడింది. ఐటీఐ విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

– వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్, ఐటీఐ కాజీపేట

నీళ్లివ్వకుంటే సీఎం ఇంటి ఎదుట ధర్నా చేస్తా

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : పంటలకు ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్ల కోసం రైతులు అరిగోస పడుతున్నారన్నారు. ఎస్సారెస్పీ కాల్వలోకి వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయపర్తి మండలంలో ఎస్సారెస్పీ కాల్వలు ఎండిపోయి ఎడారిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు నింపినట్లు గుర్తుచేశారు. తనవల్లే సాధ్యమైన మైలారం రిజర్వాయర్‌తో గ్రౌండ్‌వాటర్ పెరిగినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం మైలారం రిజర్వాయర్ నీళ్లులేక వెలవెల బోతుందన్నారు. కేశవాపురంలో ఆగిన దేవాదుల సబ్ కెనాల్ పనులు పునరుద్ధరిస్తే ఎస్సారెస్పీ కాల్వకు ఎగువన ఉన్న కేశవాపురం, కొలన్‌పల్లి, కాట్రపల్లి, పోతిరెడ్డిపల్లి, తండాలు, కిష్టాపురం, మొరిపిరాల, కొండూరు, గన్నారం, తిర్మలాయపల్లి, బురహాన్‌పల్లి గ్రామాలకు నీరందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాల్వ పనులు ఆపినట్లు గుర్తుచేశారు. పరిపాలన చేతకాకనే సకాలంలో పంటలకు నీళ్లు అందించడం లేదన్నారు. వారం రోజుల్లో రాయపర్తి మండలానికి కాల్వల్లో నీళ్లు రాకపోతే రైతులు, ప్రజలతో చేపట్టనున్న నిరసనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, నాయకులు కర్ర రవీందర్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ముద్రబోయిన సుధాకర్, చిన్నాల రాజబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంపై దాడికి యత్నం

● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హన్మకొండ : వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభానుపై జర్నలిస్టు పేరుతో ఒకరు, గిరిజన సంఘాల పేరుతో మరికొందరు దాడికి యత్నించినట్లు ఆలస్యంగా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భూపాలపల్లి డిపోనకు చెందిన కండక్టర్ రాజేష్ అదనపు డ్యూటీపై హనుమకొండ సిటీ బస్ స్టేషన్‌లోని ఆర్టీసీ డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే కండక్టర్ల కొరతతో యాజమాన్యం అదనపు డ్యూటీలు రద్దు చేసింది. దీంతో రాజేష్‌ను తిరిగి భూపాలపల్లి డిపోలో చేరాలని ఆర్డర్ ఇచ్చారు. కాగా విధుల్లో చేరడానికి సానుకూలంగా లేని రాజేష్ కొందరు గిరిజన సంఘాల నాయకుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో వారు శనివారం హనుమకొండలోని ఆర్‌ఎం కార్యాలయానికి చేరుకుని దాడికి యత్నించారని ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను తెలిపారు. వచ్చిన వారిలో ఒక్కరు జర్నలిస్టుగా చెప్పుకుని రాజేష్‌కు ఆర్టీసీ డిస్పెన్సరీలోనే కొనసాగించాలని కోరగా కండక్టర్ల కొరత ఉన్నందున భూపాలపల్లికి పంపామని చెబుతుండగానే మరో వ్యక్తి బెదిరింపులకు దిగాడని, కుర్చీ ఎత్తి తనపై దాడి చేయబోయాడని వెల్లడించారు. ఈ క్రమంలో పక్క గదిలో ఉన్న సిబ్బంది చాంబర్‌లో గొడవ జరుగుతుందని గ్రహించి వెళ్లగా ఆర్‌ఎంపై దౌర్జన్యం చేస్తుండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇది గ్రహించిన వారు అక్కడి నుంచి జారుకున్నట్లు సమాచారం. ఈ దాడిపై హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆర్‌ఎం డి.విజయభాను తెలిపారు. కండక్టర్ రాజేష్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సంగెం మండలంలోని వీఆర్‌ఎస్ తండాకు చెందిన రైతు కాడెడ్లు కడిగేందుకు వెళ్లి కుంటలో మునిగి, పర్వతగిరి మండలంలోని అన్నారం శివారు దూపతండాకు చెందిన వృద్ధురాలు విద్యుదాఘాతంతో మృతి చెందారు. అలాగే దామెర మండలంలోని ఒగ్లాపూర్ వద్ద వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు.

● కాడెడ్లు కడిగేందుకు వెళ్లి.. నీట మునిగి రైతు ..


అమర్‌సింగ్ మృతదేహం


అమర్‌సింగ్ (ఫైల్)

సంగెం : కాడెడ్లు కడిగేందుకు కుంటలో దిగిన రైతుకు ఈత రాక నీట మునిగి మృతిచెందిన సంఘటన సంగెం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెంలోని వీఆర్‌ఎస్ తండాకు చెందిన రైతు గుగులోత్ అమర్‌సింగ్ (32) తనకున్న భూమితో పాటు ఇతరుల వ్యవసాయ పనులకు నాగలి కూలీకి వెళ్తాడు. ఆదివారం తన ఎడ్లతో బురద గొర్రుతోలే పనికి వెళ్లాడు. పని పూర్తయ్యాక అవుసలికుంటలో కాడెడ్లను శుభ్రం చేయడానికి తీసుకుని వెళ్లాడు. ఎడ్లను కడుగుతుండగా కాలుజారి మొరం తీసిన గుంతలో పడిపోయాడు. ఈత రాని అమర్‌సింగ్ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కుంట నుంచి ఎడ్లు బయటకు రాగా అమర్‌సింగ్ రాకపోవడాన్ని సమీపంలో ఉన్న గుగులోత్ ఈర్య చూసి పక్కన ఉన్న గుగులోత్ శ్రీకాంత్, వాంకుడోత్ రాజేందర్‌లకు చెప్పాడు.వారు కుంటలో వెతకగా అమర్‌సింగ్ మృతిచెంది కనిపించాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..


నేజి మృతదేహం

పర్వతగిరి : విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని అన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన కథనం ప్రకారం.. అన్నారం శివారు దూపతండాకు చెందిన ధరంసోత్ నేజి (67) గతంలో భర్త మరణించడంతో ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. కాగా ఆదివారం ఉదయం వర్షం కురవడం వల్ల కరెంటు పోయింది. దీంతో విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లి కరెంట్ తీగను కదిలించింది. ప్రమాదవశాత్తు ఒక తీగ ఆమె చేతికి తాకడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. చికిత్స నిమిత్తం అన్నారంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కోడలు ధరంసోత్ విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని మతిస్థిమితంలేని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దామెర : వాహనం ఢీకొని గుర్తుతెలియని (మతిస్థిమితం లేని) వ్యక్తి మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలానిబాబా దర్గా ఎదురుగా శనివారం రాత్రి వాహనం ఢీకొనగా గుర్తుతెలియని వ్యక్తి తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు 87268 5228, 87126 85020 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం

● అభివృద్ధిలో వెనుకబడిన వరంగల్
● మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి



సదస్సులో మాట్లాడుతున్న నరహరి, చిత్రంలో బీసీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు

హన్మకొండ : రాజ్యాధికారంతోనే బీసీలకు సామాజిక న్యాయం సాధ్యమనని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జన అధికార సమితి, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో పరికిపండ్ల నరహరి రచించిన ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్ష సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికార సాధనకు ఓబీసీలు సంఘటితమై పోరాడాలని పిలుపు నిచ్చారు. కసి ఉంటే రాజ్యాధికారంలోకి రాగలుగుతామని, రెండు సామాజిక వర్గాలు కలిస్తే రాజ్యాధికారం చేపట్టడం సుళువు అని వివరించారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఇది ఎంత వరకు సాధ్యమనే సందేహాలు కూడా ఉన్నాయని నరహరి వ్యక్తపరిచారు. అన్ని బీసీ సామాజిక వర్గాలు, రాజకీయ పార్టీలు ఏకమైతే పార్లమెంట్‌లో చట్టం చేయడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధిలో వరంగల్ వెనకబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ అభివృద్ధిలో ముందుంటే వేయి సంవత్సరాల చరిత్ర కలిగిన ఓరుగల్లు వెనుకబడిందని వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాజధాని ఇండోర్ అభివృద్ధిలో ఎంతో ముందుందని, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, అధికారులు వచ్చి అధ్యయనం చేయాలని సూచించారు. ఇండోర్ ఆర్థికాభివృద్ధిలో 5 రెట్లు ముందుందన్నారు. వీఏకే ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వన్నాల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వన్నాల శ్రీరాములు, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బీసీ జేఏసీ హనుమకొండ జిల్లా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, తిరునహరి శేషు, సాంబారి సమ్మారావు, కూరపాటి నరేష్, చేరాల నారాయణ, పద్మజాదేవి మాట్లాడారు.

ప్రేమ విఫలమై.. మనస్తాపం చెంది

● ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నగేష్(ఫైల్)

కురవి : ఉరేసుకుని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కురవి మండలం సూదనపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సూదనపల్లికి చెందిన నాగనబోయిన నగేష్ (32) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డట్లు సమాచారం. ప్రేమ విఫలం కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీరోలు ఎస్సై నగేష్ పేర్కొన్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

చనిపోదామని రైల్వే ట్రాక్ వద్దకు..

● కాపాడి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు


గణేష్‌ను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధి అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్దకు చనిపోయేందుకు వచ్చిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కుసుంబ గణేష్ ఆత్మహత్య చేసుకోవడానికి రైలు పట్టాల వద్దకు చేరుకున్నాడు. ఓ వ్యక్తి రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్యకు ప్రయత్నం చేస్తున్నాడని వచ్చిన సమాచారంతో మడికొండ పోలీసులు అప్రమత్తమై వెంటనే రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. వెంటనే అతడిని రైలు పట్టాల మీద నుంచి బయటికి తీసుక వచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి నచ్చజెప్పారు. గణేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని రప్పించి క్షేమంగా అప్పగించారు. రైల్వే ట్రాక్‌వద్ద సకాలంలో ఒకరి ప్రాణాలు కాపాడినందుకు మడికొండ సీఐ పుల్యాల కిషన్, కానిస్టేబుళ్లు సీహెచ్ రాజు, కె.వాసులను అభినందించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ఎన్నిక


ఎమ్మెల్యేతో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం సభ్యులు

నర్సంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ల ఫోరం నూతన కమిటీ నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ్‌రెడ్డి, అధ్యక్షుడిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీష్ రెడ్డి, కార్యదర్శిగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల అండాళుశ్రీరామ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేతవెంకటాచారి, స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ జూలకంటి లావణ్యశిరీష్‌రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్


రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీని ఆదివారం భూపాలపల్లిలోని సింగరేణి ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డిప్యూటీ జనరల్ మేనేజర్ గోల్ల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయిపవన్ (కొత్తగూడెం ఏరియా), సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వాంకుడోతు శివ, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బొర్రా రాంబాబు, (భూపాలపల్లి ఏరియా), ఉపాధ్యక్షులుగా ఇస్లావత్ దిలీప్‌కుమార్ (శ్రీరాంపూర్ ఏరియా), అంబి రాజు (ఆర్జీ1 ఏరియా), బాలునాయక్ (కొత్తగూడెం ఏరియా), కరుణాకర్ (భూపాలపల్లి ఏరియా), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నాగేశ్వరనాయక్ (మణుగూరు వీరియా), బి.భీమా (ఆర్జీ1 ఏరియా), బానోత్ తిరుపతి (మందమర్రి ఏరియా), జాయింట్ సెక్రటరీలుగా ఇరుప కృష్ణ (కొత్తగూడెం ఏరియా), బానోత్‌చంద్రశేఖర్ (ఆర్జీ2 ఏరియా, కిరణ్ (ఆర్జీ 1 ఏరియా), జర్పుల ప్రేమ్‌లాల్ (మందమర్రి ఏరియా), ట్రెజరర్‌గా ప్రశాంత్, జాయింట్ సెక్రటరీగా ఎ.చంద్రయ్య (భూపాలపల్లి ఏరియా) ఎన్నికయ్యారు. వీరి పదవి కాలం మూడేళ్లు ఉంటుంది. ఎన్నికల అధికారిగా భూపాలపల్లి ఏరియా లైజన్ ఆఫీసర్ కలి రమేశ్ వ్యవహరించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లోని సుమారు 200 మంది సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల పట్టివేత

● స్పందించిన మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..



మడికొండ : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్‌లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని శనివారం సాక్షి దినపత్రిక ప్రచురితమైన కథనానికి ఆదివారం మున్సిపల్ సిబ్బంది స్పందించారు. మడికొండ గ్రామంలోని పలు కాలనీల్లో సంచరిస్తున్న శునకాలను పట్టుకున్నారు. పిచ్చికుక్కలు పలువురిపై దాడి చేసి గాయపర్చగా వాటిని పట్టుకున్నందుకు గ్రామస్తులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో ఇంకా కుక్కలు తిరుగుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.